

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచాలి

» జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్‌కుమార్



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో డీఈవో రమేశ్‌కుమార్

6



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో వర్షాలకు నల్లగా మారిన పత్తి



వర్షాలకు తెగులు సోకిన పత్తి పంట

నల్లబారుతున్న.. తెల్లబంగారం

- వరి పంటను వేధిస్తున్న సుడి, కంకినల్లి, బ్లాస్టింగ్ తెగులు
- మొక్కపైనే తడిసిపోతున్న పత్తి, మురిగిపోతున్న కాయలు
- ఎకరాకు 2 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడికే మాత్రమే అవకాశం
- కూలీ రేట్లు కూడా గిట్టుబాటు కావని ఆందోళనలో పత్తి రైతు
- వరి పంటలో తెగుళ్లతో తాలుగా మారుతున్న ధాన్యం గింజలు
- అధిక వర్షాల కారణంగానే వానాకాలం పంటలకు తీవ్ర నష్టం

మహబూబ్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల కారణంగా తెల్ల బంగారం నల్లగా మారుతోంది. మే చివరి వారంలో ప్రారంభమైన వర్షాలు అక్టోబరు రెండో వారం గడుస్తున్నా వీడటం లేదు. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్, జూలై నెలల్లో పత్తి సాగును రైతాంగం చేపడుతుంది. ఆ సమయంలో కురిసే వర్షాలతో పత్తి ఏపుగా పెరిగి ఆగస్టు వరకు కాత దశకు చేరుకుంటుంది. సెప్టెంబరు రెండో వారం నుంచి పత్తి సేకరణ సీజన్ ప్రారంభమై డిసెంబరు నాటికి పూర్తవుతుంది. రాష్ట్రంలో సాధారణం కంటే రెండు మూడు రెట్ల అధిక వర్షపాతం నమోదు కావడంతో వచ్చిన గూడ వచ్చినట్లు రాలిపోయింది. దీంతో దిగుబడి తక్కువవుతుందనే అంచనాలు సీజన్ మొదటి నుంచీ ఉన్నాయి. అయితే కాసిన కాయలు కూడా వర్షాల కారణంగా మొక్కపైనే మురిగిపోతున్నాయి. మొదటి దశలో వచ్చిన కాయలు పగలడంతో వాటిని ఏరేందుకు కూడా వర్షం ఆగడం లేదు. పత్తి పూర్తిగా తడిసిపోయి నల్లగా మారుతోంది. కాయలు మురిగిపోతున్నాయి. తడిసిన పత్తిని తీయడానికి సాధారణం కంటే అధికంగా కూలీలు

(మిగతా 6లో..)

అధిక వర్షాలు ముంచేశాయి



అనుకున్న దాని కంటే ఈ ఏడాది ముందుగానే వర్షాకాలం ప్రారంభం కావడంతో ఉత్సాహంగా పత్తి సాగు చేశాను. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో పంట దిగుబడి ఎక్కువవుతుందని ఆశించాను. కానీ ఆ అధిక వర్షాలు తగ్గకపోవడం, ఇంకా కురుస్తుండటంతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎకరాకు సుమారు రూ. 45 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. గతేడాది కంటే సగం కన్నా ఎక్కువ దిగుబడి తగ్గే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో తీసిన పత్తి నల్లగా మారుతోంది. దానికి మార్కెట్‌లో ధర రావడం లేదు. తడిసిన పత్తి తీసేందుకు కూలీలు కూడా రావడం లేదు. మొక్కపైనే కాయలు కూడా మురిగిపోతున్నాయి.

- రాముడు, కొమ్ముకుంట తండా, తాడూరు మండలం, నాగర్‌కర్నూలు జిల్లా

క్రీడాభివృద్ధికి పెద్దపీట

- ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ టోర్నీ
- బాల బాలికల విభాగాల్లో మహబూబ్‌నగర్ శుభారంభం
- 28 జిల్లాల నుంచి పాల్గొన్న 1,200 మంది క్రీడాకారులు



మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ టోర్నీని నిర్వహిస్తున్నారు. పోటీలను వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన

(మిగతా 6లో..)

ఇళ్ల నిర్మాణం వేగవంతం

» జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్
» జింకలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఎర్రవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా చేపట్టాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామంలో 26 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా, 8 మంది మాత్రమే నిర్మాణం ప్రారంభించారని తెలిపారు.

మిగిలిన వారు కూడా నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇసుక కొరతతో పనుల్లో జాప్యం జరుగుతోందని చెప్పడంతో, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిద్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి శారద, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, నాయకుడు భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

అతడే అసలు నేరస్థుడు

- పీర్ల చావిడి చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- ఫిర్యాదుదారుడితో పాటు ముగ్గురి అరెస్టు
- వెండి, ఇత్తడి ఆభరణాలు, కారు, బైక్ స్వాధీనం
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

6



వాగు మురిసి.. అలుగు పారి..

కుండపోత వానలకు పెద్దవాగు మురిసి అలుగు పారింది. నిండు నీటితో నీలి ఆకాశం, పచ్చని చెట్లకు అద్దమై అందాలు అద్దుకున్నది. ప్రకృతి గీసిన సహజ వర్ణ చిత్రమై కనుల పండువ చేసింది. ఈ దృశ్యం వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి శివారులో 'ఆంధ్రజ్యోతి' కంట పడింది. కెమెరా క్లిక్కుమనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

నీతి ఫర్ స్టేట్స్‌లో గద్వాల జిల్లాకు రెండవ స్థానం



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఈవో విజయలక్ష్మి

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీతి ఫర్ స్టేట్స్ డేటా ఆధారిత యూజ్ కేస్ పోటీ 2024-25లో జోగులాంబ గద్వాల జిల్లాకు విద్యారంగంలో రెండవ స్థానం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎం సంతోష్‌ను డీఈవో విజయలక్ష్మి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ అవార్డుతో పాటు ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల బహుమతి కూడా లభిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ గుర్తింపునకు కారణమైన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లాను రాష్ట్రంలో ముందు స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏసీఈ శ్రీనివాసులు, జిల్లా సమన్వయ అధికారి హంపయ్య ఉన్నారు.

మీ చర్మంతో చెప్పులు కుట్టించినా తప్పులేదు

» అప్పుడు అక్రమార్జన, ఇప్పుడు బాకీ కార్డులు
» వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అక్రమంగా ఆర్జించిన మీరు రాష్ట్ర ప్రజలకు మీ చర్మంతో చెప్పులు కుట్టించినా తప్పులేదని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డి గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ తరఫున రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వనపర్తిలో భూకబ్జాలు చేసి, చెరువు కట్టల పేరున, అభివృద్ధి మాటున రూ. 400 కోట్లు అక్రమార్జన చేసిన వారికి ఇప్పుడు బాకీ కార్డులు పట్టుకొని తిరిగే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను పదవిలో ఉన్నంత కాలం పాలమూరు అభివృద్ధికి ఏటా రూ. 25 వేల కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గానికి మొత్తం 2,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో మొదటి విడుతగా 890 క్వింటాళ్లను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకటస్వామి, రమేశ్‌గౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్ నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి

» నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి

6

'పది శాతం' భూమిపై కన్ను

» స్వాధీనం చేసుకునేందుకు కుట్ర
» పసిగట్టి రాత్రికి రాత్రే దేవుళ్ల విగ్రహాల ఏర్పాటు
» మరో వెంచర్ దారుడికి బెదిరింపులు
» పోలీసులకు రెండుసార్లు ఫిర్యాదు



కబ్జాకు గురికాకుండా రాత్రికి రాత్రే ఏర్పాటు చేసిన విగ్రహాలు



వెంచర్‌కు అడ్డుగా రోడ్డును తవ్వేసిన దృశ్యం

గద్వాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని జమ్మిచేడు దాని పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. గద్వాల - కర్నూల్ ప్రధాన రోడ్డు కావడంతో రోడ్‌సైడ్ ప్లాట్ ధర రూ.కోటికి పైగా పలుకుతుంది. ఈజీగా డబ్బు సంపాదించే వారు కొందరు, వెంచర్‌దారులను భయపెట్టించి వారితో భారీగా ముడుపులు తీసుకుంటుంటారు. ఇవ్వకపోతే నానా హంగామా చేస్తారు. వీటిలో చాలా వరకు గుట్టుగా రాజీ చేసుకుంటారు. కొన్ని మాత్రమే బయటకు వస్తాయి. అలాంటి సంఘటనే జమ్మిచేడు పరిధిలో చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలోనూ ట్రోల్ అవుతున్నది.

కాపాడుకునేందుకు యత్నం

గద్వాల మునిసిపాలిటీ పరిధిలోని జమ్మిచేడులో గద్వాల - కర్నూల్ రోడ్డు పక్కన కొన్నేళ్ల క్రితం ఓ వెంచర్‌ను అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. భూ యజమానులు, వెంచర్‌దారుడు అందులో పది శాతం భూమిని వదిలి ప్లాట్లను విక్రయించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు వేశారు. దాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చుకోలేదని కూడా తెలిసింది. అనుమతి లేని వెంచర్ కావడంతో వదిలిన పది శాతం భూమి యజమాని పేరుపైనే ఉంది. ఆ భూమి పక్క నుంచి సమీపంలోని గ్రామ దేవత వరకు రోడ్డు ఉంది. దీంతో ఎలాగైనా ఆ పది శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొందరు 'పెద్ద మనుషులు' పథకం వేశారు. విషయం తెలిసిన కాలనీవాసులు రాత్రికి రాత్రే అక్కడ ఓ షెడ్డు వేసి శివుడు, విఘ్నేశ్వరుడు, నంది విగ్రహాలను ఏర్పాటు చేశారు. వారి పన్నాగం విఫలమైంది. ఈ సంఘటన 20 రోజుల క్రితం జరిగింది. ప్రాణ ప్రతిష్ఠ లేకుండా దేవుళ్లను పెడితే ఊరికి అరిష్టం జరుగుతుందని ప్రజలను భయపట్టేందుకు యత్నించారు. కానీ వారికి స్థానికుల మద్దతు లభించలేదు. దీంతో అసహనానికి గురైన సదరు పెద్ద మనుషులు దాని పక్కనే ఉన్న వెంచర్‌దారుడిపై పడ్డారు.

రూ.40 లక్షలు డిమాండ్

ఇటీవల అదే వెంచర్ పక్కన అనుమతుల(0006/ఎల్‌ఓ/3059/2024)తో మరో వెంచర్ వెలిసింది దాని యజమానులు నిబంధనల ప్రకారం రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి, పది శాతం భూమిని వదిలారు. అయితే ఆ వెంచర్‌దారుడు దాని ముందున్న వెంచర్‌లో 25 ఫీట్ల భూమిని కలుపుకొని 40 ఫీట్ల రోడ్డు వేశారు. కలుపుకున్న భూమి విలువ రూ.60 లక్షలు ఉంటుంది.. చివరగా రూ.40 లక్షలు ఇవ్వాలంటూ అతడిపై బెదిరింపులకు దిగారు. వారు భయపడక పోవడంతో గత నెల 30వ తేదీన రోడ్డుకు అడ్డంగా సిమెంట్ దిమ్మెలను పాతారు. దీంతో వెంచర్ యజమానులు దిలీప్ కుమార్ రెడ్డి, నర్సింహులు, జనార్దన్‌గౌడ్‌లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని పిలిచి సర్దిచెప్పి పంపించేశారు. దీంతో ఆ పెద్ద మనుషులు 'మా పైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా...? మీరు ప్లాట్లు ఎలా విక్రయిస్తారో చూస్తాం' అంటూ గురువారం తెల్లవారుజామున ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు అడ్డంగా గుంతలు తవ్వడంతో వెంచర్‌కు దారి లేకుండా పోయింది. దీంతో ఆ వెంచర్ యజమానులు మరోసారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల వెనుకడుగు!

జమ్మిచేడు, దాని పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకడుగు వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

సదరు వ్యక్తుల వెనక పెద్ద మనుషులు ఉండటంతో అందుకు కారణమని తెలుస్తోంది. ఈ విషయంపై రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమే అన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

గోల్ఫ్‌లో జెరూషా జాయన్‌కు రెండో స్వర్ణం

మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా బంగారు పతకం



క్రీడలు , యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ జెరూషా జాయన్

నర్వ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, నర్వ మండలంలోని లంకాల గ్రామానికి చెందిన జెరూషా జాయన్ గోల్ఫ్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచింది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని నార్సింగి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జెరూషా ఈ నెల 7, 8 తేదీల్లో విశాఖపట్నంలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన బీ గర్ల్స్ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నది. గత ఏడాది కూడా ఆమె బంగారు పతకాన్ని సాధించింది. వరుసగా రెండు సంవత్సరాలు బంగారు పతకాన్ని సాధించిన జెరూషాను క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అభినందించారు.

11గంటలైనా తీయని తాళం

» బీకే ఉప్పునుంతల ఐటీడీఏ పాఠశాల పరిస్థితి



అమ్రాబాద్ మండలం బీకేఉప్పునుంతలలో ఉదయం 11గంటల వరకు కూడా తాళం తీయని ఐటీడీఏ పాఠశాల

అమ్రాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకేఉప్పునుంతల గ్రామంలో ఐటీడీఏ ప్రాథమిక పాఠశాల శుక్రవారం ఉదయం 11గంటల వరకు కూడా ఉపాధ్యాయులు తాళం తీయలేదు. ఈ పాఠశాలలో 1-3 తరగతుల వరకు ఉండగా ఇందులో సుమారు 30మంది వరకు చెంచు గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయురాలు కొంత కాలంగా సమయపాలన పాటించనందున విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే గ్రామస్థులు ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకుపోయారు. అయినా ఉపాధ్యాయురాలు పని తీరులో మార్పు రాలేదని గ్రామస్థులు ఆరోపించారు. బీకే ఉప్పునుంతలలో పాఠశాలను సక్రమంగా తెరవడం లేదనే విషయంపై మన్ననూరు ఐటీడీఏ పాఠశాలల క్లస్టర్ కోఆర్డినేటర్ కల్యాణ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దసరా సెలవుల అనంతరం ఈ పాఠశాల ఉపాధ్యాయురాలు సక్రమంగా విధులకు రావడం లేదని గ్రామస్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. ఇకపై పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటానని ఆయన వెల్లడించారు.

40 వేల మైలురాయి దాటిన మహీంద్రా..

» ఘనంగా శ్రీరామ జయరామ 51వ వ్యవస్థాపక దినోత్సవం



40 వేలవ ట్రాక్టర్‌ను కస్టమర్‌కు అందజేస్తున్న శ్రీరామ జయరామ అధినేత బెక్కరి రాంరెడ్డి

పాలమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒకటి, రెండు ట్రాక్టర్లను అమ్ముకుంటూ ఏకంగా ఈరోజు 40వేల ట్రాక్టర్లను కస్టమర్‌కు అందజేయటంలో ఉన్న సంతోషం మాటల్లో చెప్పలేమని శ్రీరామజయరామ అధినేత బెక్కరి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో శ్రీరామ జయరామ 51వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 1974లో తన తండ్రి బెక్కరి బాలకిష్టారెడ్డి మోటార్‌మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించినప్పుడు ఉన్న విలువలను నేటికీ తాము ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అదే ఏడాది టీవీఎస్ ద్విచక్ర వాహనాల డీలర్‌షిప్ తీసుకున్నం. 2012లో మారుతి కార్ల డీలర్‌షిప్‌ను ప్రారంభించి నేటికి 20వేలకు పైగా కార్లను అమ్మినట్లు తెలిపారు. ఈ 50ఏళ్ల యాత్ర సహకరించిన కస్టమర్లకు, ఫైనాన్షియర్లకు, బ్యాంకర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ జయరామ సంస్థల డైరెక్టర్ బెక్కరి జయలక్ష్మి, మహేంద్ర జోనల్ సేల్స్ హెడ్ ఇంద్రకంటి అరవింద్, ఏరియా సీనియర్ ఏరియా మేనేజర్ శెట్టిఉదయ్, డిప్యూటీ మేనేజర్ యాషిఫ్, సంస్థ సీఈఓలు సరసయ్య, విక్రమ్‌యాదవ్, నాగేంద్ర, మారుతి షోరూం జీయం వేణుగోపాల్‌రెడ్డి, మహీంద్రా షోరూం జీఎం రామకృష్ణ, తుకారాం, రామదాసు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, 1200మంది ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అంతర్గత రహదారులు ఎక్కి పారుతున్న వరద నీరు



నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై ఐతోల్ వద్ద లోలెవల్ కాజ్‌వేపై ఎక్కిపారుతున్న వర్షపు నీరుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు

తాడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రిభారీ వర్షం కురిసింది. దీంతో శుక్రవారం మండలంలోని ప్రధాన రహదారుల లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వర్షపు నీరు ఎక్కి పారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై ఐతోల్ సమీపంలో ఉన్న లోలెవల్ కాజ్‌వేపై నుంచి వర్షపు నీరు ఎక్కిపారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంతో పాటు చాలా వాహనదారులు వెనుదిరిగి వెళ్లిపోయాయి.

నల్లబారుతున్న తెల్లబంగారం

(5వ పేజీ తరువాయి)

అవసరమవుతారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పత్తి రైతులకు తీవ్ర నష్టాలు మిగులనున్నాయి. సెప్టెంబరు మూడు, నాలుగో వారం నుంచి తీసిన పత్తి నల్లగా ఉండటం, ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాల్సిన కొనుగోళ్లు జరగకపోవడంతో దళారులు కనిష్ఠంగా రూ. 3 వేలు, గరిష్ఠంగా రూ. 6 వేల వరకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఇది ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 8110 కంటే చాలా తక్కువ. సగటున రూ. 4500 వరకు ధర పలుకుతోంది. కపాస్ కిసాన్ యాప్ నేపథ్యంలో ఇప్పటి వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టత రావడం లేదు. ఓవైపు అధిక వర్షాలతో తగ్గిన దిగుబడి మరోవైపు పత్తి నల్లగా మారడం, సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో రాని ధర కలిపి పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.



పత్తి తీయకపోవడంతో వర్షాలకు మొక్కలపైనే కిందకు పడిపోతున్న పత్తి

పెట్టుబడి ఖర్చులు రావడం కష్టమే..

రాష్ట్రంలో సుమారు 41 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగైంది. కొన్ని జిల్లాల్లో గతేడాది కంటే అదనంగా సాగు జరిగింది. ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఈ ఏడాది 1.19 లక్షల ఎకరాల్లో అదనపు సాగు జరిగింది. ఎకరా పత్తిసాగుకు సుమారు రూ. 35,200 వరకు పెట్టుబడి అవుతుంది. కౌలు తీసుకున్న భూమి అయితే దీనికి మరో రూ. 12 వేలు అదనంగా అవుతుంది. దుక్కులు సిద్ధం చేయడానికి రూ. 6 వేలు, పత్తి విత్తనాలు 4 ప్యాకెట్లకు రూ. 3700, పంటకు మూడు దఫాలుగా ఎరువులు వేయడానికి రూ. 5500, అచ్చు వేయడం, గుంటుక తీసేందుకు రూ. 6 వేలు, కలుపు తీసేందుకు కూలి ఖర్చు రూ. 5500, క్రిమిసంహారక మందుల పిచికారీకి రూ. 8500 వరకు ఖర్చు వస్తుంది. మొత్తం కలిపి రూ. 35,200 కాగా.. కౌలుతో కలుపుకొని రూ. 47,200 వరకు ఖర్చవుతుంది. పత్తి సేకరణకు గుత్త పద్ధతిలో కిలోకు రూ. 15 నుంచి రూ. 20 వరకు, కూలీ పద్ధతిలో అయితే రూ. 350 నుంచి రూ. 500 వరకు పెట్టుబడికి అదనం. మొత్తం కలుపుకుంటే కనీస ఖర్చు రూ. 55 వేల పైమాటే. ఇంత చేస్తే సాధారణంగా 10 క్వింటాళ్ల వరకు సగటున దిగుబడి వచ్చే పత్తి ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 2 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్ల వరకు వచ్చే పరిస్థితి ఉంది. ధర తక్కువగా ఉంటే పెట్టుబడి ఖర్చులు కూడా రావడం కష్టమే. ఈ నేపథ్యంలో కొందరు రైతులు పత్తి తీయకుండా వదిలేద్దామా? అనే భావనలోకి వెళుతున్నారు. గద్వాల జిల్లాలోని అలంపూర్ ప్రాంతంలో కొన్నిచోట్ల గత నెలలోనే పత్తిని తొలగించి పొగాకు సాగును రైతులు చేపట్టారు.

వరిని వేధిస్తున్న తెగుళ్లు...

ఓ వైపు ఆరుతడి వ్యవసాయం చేసే రైతులను పత్తి దెబ్బతీస్తే సాగునీటి వనరులు ఉన్నచోట వరిని తెగుళ్లు పీడిస్తున్నాయి. అధిక వర్షాల కారణంగా కాండం కుళ్లు, సూడిదోమ, కంకినల్లి, బ్లాస్టింగ్ తెగుళ్లు తీవ్రంగా వస్తున్నాయి. దీని కారణంగా వరి పొట్ట దశలో ఉండగా గింజలు తాలుగా మారిపోతున్నాయి. కొన్నిచోట్ల పంట తెగులు సోకి పూర్తిగా చనిపోతోంది. దీనివల్ల ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు చివరి వారం వరకు పొంట పొలాలకు ఈ తరహా తెగుళ్లు సోకుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలోనే వర్షాలు కురుస్తుండటంతో నష్టం తీవ్రత కూడా పెరిగిపోతోంది. నవంబరు నుంచి చలి తీవ్రత తగ్గితే అప్పుడు తెగుళ్ల ప్రభావం తగ్గిపోతుంది. అయితే అప్పటికే మెజారిటీ వరి కోతకు వస్తుంది. దీంతో వరి రైతుల్లో ఆందోళన నెలకొన్నది. ప్రభుత్వం ఇన్‌పుడ్ సబ్సిడీ కింద పంట నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే పెట్టుబడి డబ్బుల కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతామని వాపోతున్నారు.

పెట్టుబడి ఎక్కువవుతోంది



వర్షాకాలం ముందుగానే ప్రారంభం కావడంతో పంట ముందుగానే చేతికి వస్తుందని ఆనందపడితే తెగుళ్లు పంటలను ఆశించి నాశనం చేస్తున్నాయి. మాది వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల. నాకు ఉన్న పొలంతో పాటు మరో 9 ఎకరాలు కౌలుకు తీసుకొని జూరాల నీటి ఆధారంగా జూలైలో నాట్లు వేశాను. వరి కంకి పొట్ట దశకు వచ్చే సరికి సుడి దోమ, కంకినల్లి, బ్లాస్టింగ్ తెగుళ్లు ఆశించాయి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పిచికారి మందులు కొడుతున్నా తెగులు ఉధృతి తగ్గడం లేదు. దీంతో గతేడాది పోలిస్తే ఈ ఏడాది రూ. 10 వేల వరకు అదనంగా పెట్టుబడి అయ్యింది. అయినా దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంది.

- ఎల్లన్న, రైతు, మూలమల్ల, వనపర్తి జిల్లా

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



భారత నెట్‌బాల్ జట్టుకు ఆడిన యశశ్రీ, లితిషలను సన్మానిస్తున్న దృశ్యం



గెలిచిన మహబూబ్‌నగర్ బాలుర జట్టు

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ జిల్లా మైదానం అబివృద్ధికి రూ. 16 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ మంజూరు చేసిందని, సింథటిక్ ట్రాక్‌తో పాటు ఇండోర్ స్టేడియంలో సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని చెప్పారు. టోర్నీలో 28 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ట్రెడిషనల్, ఫస్ట్-5, మిక్స్‌డ్ మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. అనంతరం భారత జట్టుకు ఆడిన యశశ్రీ, లితిషలను ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమాదిత్యారెడ్డి, కార్యదర్శి శిరిషరాణి, అసోసియేషన్ ప్రతినిధులు ఖాజాఖాన్, రాంమోహన్, అంజద్‌అలీ, షరీఫ్, అక్రమ్, రాజరాం పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం..

రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. బాలురు విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 16-1 పాయింట్ల తేడాతో పెద్దపల్లి జట్టుపై, 15-9 పాయింట్లతో తేడాతో సిరిసిల్లపై శుభారంభం చేసింది. వనపర్తి జట్టు 7-1 తేడాతో వరంగల్‌పై, నల్గొండ 14-1 తేడాతో ఆదిలాబాద్‌పై, ఖమ్మం 16-5 తేడాతో ఆసిఫాబాద్‌పై, మహబూబాబాద్ 15-7 తేడాతో నిజామాబాద్‌పై గెలుపొందాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 5-1 పాయింట్ల తేడాతో సిరిసిల్లపై, 9-1 తేడాతో వికారాబాద్‌పై గెలిచి శుభారంభం చేసింది. మేడ్చల్ 14-2 తేడాతో ఆదిలాబాద్‌పై, నల్గొండ 12-4 తేడాతో వరంగల్‌పై, హైదరాబాద్ 4-2 తేడాతో మెదక్‌పై, కామారెడ్డి 4-1 తేడాతో నారాయణపేటపై, కరీంనగర్ 6-2 తేడాతో జనగాంపై, రంగారెడ్డి 9-7 తేడాతో వనపర్తిపై, మేడ్చల్ 6-1 తేడాతో పెద్దపల్లిపై, ఖమ్మం 14-2 తేడాతో మహబూబాబాద్‌పై గెలుపొందాయి. హైదరాబాద్ జట్టు 10-1 తేడాతో నిర్మల్‌పై, నాగర్‌కర్నూల్ 6-3 తేడాతో కామారెడ్డిపై, నిజామాబాద్ 8-5 తేడాతో కరీంనగర్‌పై, ఆసీఫబాద్ 10-9 తేడాతో గద్వాలపై, జగిత్యాల 6-1 తేడాతో మంచిర్యాలపై, భద్రాద్రి కొత్తగూడెం 5-2 తేడాతో వరంగల్‌పై విజయం సాధించాయి.

అతడే అసలు నేరస్థుడు

» పీర్ల చావిడి చోరీ కేసును ఛేదించిన పోలీసులు
» ఫిర్యాదుదారుడితో పాటు ముగ్గురి అరెస్టు
» వెండి, ఇత్తడి ఆభరణాలు, కారు, బైక్ స్వాధీనం
» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పీర్ల చావిడిలోని పెట్టెలో దాచి ఉంచిన వెండి, ఇత్తడి వస్తువులను దోచుకున్నాడు.. ఆ తర్వాత ఏమీ ఎరుగనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో అతడే అసలు నేరస్థుడని తేలడంతో కటకటాల పాలయ్యాడు. కేసు వివరాలను వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. చిన్నంబావి మండలలోని బెక్కెం గ్రామంలోని పీర్ల చావిడిలో ఈ నెల 7వ తేదీన చోరీ జరిగినట్లు షామీర్ పాషా అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడే అసలు నేరస్థుడని తేలింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. అడ్డాకల్ మండలం కందూరు గ్రామానికి చెందిన షామీర్‌పాషా రెండు రోజులకో సారి బెక్కెం గ్రామంలోని పీర్ల చావిడికి వచ్చేవాడు. అనారోగ్యం బారిన పడిన వారికి మంత్రాలతో నయం చేస్తామని ప్రజలను నమ్మించాడు. అలాగే గత నెల 21న, అమావాస్య రోజు పీర్ల చావిడికి వచ్చాడు. చావిడిలోని చెక్కపెట్టెలో పీర్లకు సంబంధించి వెండి, ఇత్తడి ఆభరణాలను దొంగిలించాడు. వాటిని కారులో కందూరు గ్రామంలోని తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఈ విషయాన్ని 15 రోజుల వరకు గ్రామస్థులు గుర్తించలేదు. దీంతో షామీర్ పాషా ఈనెల 7వ తేదీన పీర్ల చావిడిలో వస్తువులను చిందరవందరగా పడేసి అక్కడక్కడ కారం పొడి చల్లాడు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామస్థుల సహకారంతో విచారణ చేపట్టిన పోలీసులు కేసును ఛేదించారు. షామీర్ పాషాతో పాటు అతడికి సహకరించిన మందడి శివకృష్ణ, వనమల మురళీధర్, అనుకలి మహేశ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వారి నుంచి రూ. 10 లక్షల విలువైన 9.3 కిలోల వెండి, 13.5 కిలోల ఇత్తడి ఆభరణాలు, కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేధించిన సీఐ కృష్ణయ్య, సీ సీఎస్ ఎస్‌ఐలు జయన్న, రామరాజు, క్లూస్ టీమ్ రవి సాగర్, చిన్నంబావి ఎస్ఐ జగన్మోహన్‌లను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యసాయి తాగునీటి పంప్‌హౌస్‌కు తాళం

● మా భూమిలో పంప్‌హౌస్ నిర్మించారు
● న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటాం
● పురుగు మందు డబ్బాతో బాధిత కుటుంబం ఆందోళన



సత్యసాయి పంపుహౌస్‌కు తాళం, ముళ్ల కంచెలు వేసి పురుగుల మందు డబ్బాతో బాధితురాలు బుడ్డొమొళ్ల పార్వతి

కృష్ణ ,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి పంప్‌హౌస్‌కు తాళం వేసి, పురుగుల మందు డబ్బాతో ఓ కుటుంబ సభ్యులు బైఠాయించిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామ శివారులోని 167 వ జాతీయ రహదారి పక్కన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలు బుడ్డొమొళ్ల పార్వతి తెలిపిన వివరాల ప్రకారం... తనకు, తన భర్త వార సత్వంగా వచ్చిన సర్వే నెం. 191లో 30 గుంటల భూమి ఉంది. 20 సంవత్సరాల క్రితం తన పొలంలో 20 గుంటల భూమిలో సత్యసాయి తాగు నీటి పంప్‌హౌస్ ఏర్పాటు చేయడానికి అనుమతి తీసుకున్నారు. నిర్మాణ సమయంలో తన భర్త లింగప్పకు ఒక ఇల్లు, సత్యసాయి పంప్‌హౌస్‌లో పర్మినెంట్ ఉద్యోగం, భూమికి నష్ట పరిహారం ఇస్తామని అప్పట్లో చెప్పారు. నేటికీ ఇవ్వకుండా కలెక్టర్, ఆర్‌డీవో, మిషన్ భగీరథ ఎస్‌సీ, నారాయణపేట మిషన్ భగీరథ ఏఈల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం దక్కలేదు. దీంతో తిరిగి తిరిగి తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ శివారులో భారత్ మాల రోడ్డు మంజూరు కాగా, సత్యసాయి తాగునీటి పంప్‌హౌస్ నిర్మాణంలో గల 7 గుంటల భూమి అందులోకి వెళ్లింది. ఇందుకు గాను భారత్‌మాల నుంచి వచ్చే నష్ట పరిహారం ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నారు. నా కుమారుడికి నెలకు 7 వేల జీతం ఇస్తున్నారు. దీంతో భారత్ మాలలో నష్టపరిహారం మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత్ మాల వెళ్లే భూమి నష్టపరిహారం ఇవ్వాలని, లేకుంటే ముగ్గురు పిల్లలతో సత్యసాయి పంప్ హౌస్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఉన్న 10 గుంటలు సేద్యం చేస్తూ ముగ్గురు పిల్లలను పట్టుకుని కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

అధికారుల పరుగు..

మండల పరిధిలోని గుడేబల్లూరు గ్రామ శివారులోని సత్యసాయి పంపు హౌస్‌కు తాళం వేసిన విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి పరుగులు పెట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ జగన్, తహసీల్దార్ శ్రీనివాస్, నారాయణపేట మిషన్ భగీరథ ఏఈ, మండల ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్,ఎస్ఐ నవీద్ శుక్రవారం బాధితురాలు కుటుంబ సభ్యులతో చర్చించారు. సోమవారం వరకు గడువు ఇవ్వాలని కోరారు.

నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఒకటవ యూనిట్‌ను ప్రారంభించి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని చేపడుతున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. గడిచిన 24 గంటల్లో ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.870 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 403.165 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.274 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 39 జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.274 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 390.084 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల

దేవరకద్ర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యతరహా అయిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఒక గేటు నుంచి దిగువకు నీటివిడుదల చేయడంతో ఒక ఫీటు ఎత్తడంతో 700 క్యూసెకుల నీరు దిగువకు వదిలారు. శుక్రవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32.2 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతోందని నీటి పారుదల శాఖ ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి

» నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి
» కార్వంగలో బాకీ కార్డుల పంపిణీ



తెలకపల్లి మండల కార్వంగలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. దీనికి సంబంధించిన బాకీ కార్డులను ప్రజలందరికీ చేర్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని కార్వంగలో శుక్రవారం ప్రజలకు బాకీ కార్డులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని విమర్శించారు. పథకాల అమలు తక్కువ, ప్రచారం ఎక్కువ అన్న తీరున కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ బాకీ కార్డులను ఒక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచాలి

» జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్
» జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌ను డీఈవో ప్రాంభించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు అండర్-14 విభాగంలో కబడ్డీ, అండర్-17 విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సీతారాం, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాండు, క్రీడల నిర్వహణ కార్యదర్శి సామ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మల్లయ్య, పాండు, వెంకటేష్, రాజన్ గౌడ్, రమేష్, మోహన్‌లాల్, నరేందర్ నాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సైన్స్ డ్రామా, రోల్‌ప్లే పోటీలకు ఎంపికలు పూర్తయ్యాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కేజీబీవీ బల్మూరు విద్యార్థిని ప్రథమ, జడ్పీహెచ్ సింగోటం విద్యార్థి ద్వితీయ, ఊర్కొండ కేజీబీవీ విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారిని ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు భూదానం మురళీధర్‌రావు, వహీద్‌ఖాన్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

అండర్-17 వాలీబాల్ జట్ల ఎంపిక

జడ్చర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్ బాలుర, బాలికల జట్ల ఎంపికను శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను డీఈఓ ప్రవీణ్, ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌జీఎఫ జిల్లా కార్యదర్శి శారదాబాయి, పీడీ, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ ప్రారంభించారు. ఈ ఎంపికలో జిల్లాలోని 16 మండలాలు, రెండు అర్బన్ ప్రాంతాల నుంచి 490 మంది క్రీడాకారులు పాల్గొనగా. 18 మంది సభ్యులతో కూడిన బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాదిమి రవిశంకర్, పీఈటీలు వడన్న, జగన్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీకి విఫలయత్నం

మక్తల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ప్రధాన రహదారిపై ఉన్న విష్ణు జువెల్లరి దు కాణంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీకి విఫలయత్నం చేశారు. షట్టర్ తాళం విరగ్గొట్టేం దుకు పయత్నం చేశారు. అది రాకపోవడంతో గోడకు, షట్టర్‌కు రంధ్రం వేసేందుకు ప్రయత్నించారు. శుక్రవారం ఉదయం జువెల్లరీ దుకాణంలో పని చేసే వ్యక్తి దుకాణం వద్దకు వచ్చాడు. తాళం కట్‌చేయడం, గోడకు రంధ్రం వేసి ఉండటాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు - జరిమానా

వెల్దండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు మూడురోజుల జైలు, వెయ్యి రూపాయల జరిమానాను విధించి నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల లక్ష్మయ్య మద్యం తాగి వాహనం నడపగా వెల్దండ పో లీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఈమేరకు అతనిపై కేసున మోదు చేయగా శుక్రవారం కల్వకుర్తి కోర్టు అతనికి మూడురోజుల సాధార ణ జైలు, వెయ్యి రూపాయల నగదు జరిమానాను విధించినట్లు కురుమూర్తి పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

లింగాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందగా దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని డీసీతండాకు చెందిన జరుపుల రాములు అనే రైతు మేత కోసం తన వ్యవసాయ పొలంలో ఎద్దులను కట్టేసి ఉంచినట్లు తెలిపా రు. మేత మేసుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా తెగిపడిన తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె..

నవాబ్‌పేట,(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం లోని కారుకొండ గ్రామానికి చెందిన సాకలి కిష్టయ్య పాడి గేదె పిడుగు పాటుకు గురువారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని భాదితుని న్యాయం చేయాలని గ్రామస్థులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజుకుమార్, రంగారెడ్డి తదితరులు కోరారు.

భార్య మందలింపు.. భర్త ఆత్మహత్య

నవాబ్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందని మనస్తా పానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, ఆసుపత్రి లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని జంగమయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి ఆచారి (45) ఈ నెల 4న సాయంత్రం మద్యం తాగి ఇంటికి రాగా భార్య రాధమ్మ మందలించింది. నిత్యం తాగితే కుటుంబం ఎలా గడుస్తుందని భర్తతో గొడవకు దిగింది. మనస్తాపానికి గురై ఇంటి మీద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి..

రాజాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజా పూర్ మండల కేంద్రనికి చెందిన వ్యక్తి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. షాద్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ వివరాల ప్రకారం.. గూని యాదయ్య (55) భార్యతో గొడవపడి క్షణికావేశంలో స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

చతీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

» జగత్‌పల్లి వాసి మృతి


మహేష్ (ఫైల్)

పెద్దమండడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడంతో కుటుంబం, గ్రామంలో తీవ్ర విషాదం అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పెద్దమండడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన నర్సమ్మకు మహేష్ (22) ఏకైక కుమారుడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన మహేష్‌ను తల్లి కష్టపడి బాగా చదివించింది. మహేష్ ఎంఎల్‌టీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. కానీ చతీష్‌గడ్ రాష్ట్రంలో రాయపూర్ జిల్లాలో ఓ ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్‌లో జాబు కోసం వెళ్లాడు. అయితే గురువారం సాయంత్రం తన ద్విచక్ర వాహనం రాయపూర్‌కు వెళ్తుండగా వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహేష్ మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

మహిళ అనుమానాస్పదంగా..

కృష్ణ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడేబ ల్లూరు గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. దండు శంకరయ్య (43) గ్రామ శివారులో వరి పొలం గట్టు నుంచి వరి పొలంలో పడి మృతి చెందింది. దీంతో మేకలు కాస్తూ వెళ్లిన తల్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో రాము తల్లి కోసం వెళ్లగా వరి పొలంలో అచేతనంగా పడి ఉంది. తల్లిని గమనించి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి ఎస్ఐ నవీద్, సిబ్బంది కలిసి పొలం దగ్గర పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతి చెందిన శంకరమ్మ కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆత్మహత్యేనా?


బొసింగ్ (ఫైల్)

రేవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేవల్లి మండలంలోని పాతతండా గ్రామ పంచాయతీకి చెందిన నున్సావత్ బొసింగ్ (35) తన ఇంట్లోనే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పాత తండా గ్రామానికి చెందిన బొసింగ్ తన భార్య చిట్టి ఇద్దరు కుమారులు ఒక కూతురుతో కలిసి హైదరాబాద్‌లో కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం అతను తన భార్య చిట్టితో గ్రామానికి వచ్చాడు. రాత్రి సమయంలో ఇద్దరు గొడవ పడ్డారు. తెల్లవారేసరికి చిట్టి భర్త వారు పడుకున్న రూమ్‌లోనే ఉన్న ఇనుప కడ్డికి చీరతో ఉరి వేసుకొని చనిపోయినట్లుగా కలినిపించాడు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా, ఒంటిపై గాయాలు ఉన్నాయి. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాత్రంతా ఇంటి లోపల గడియ పెట్టుకొని ఉండగా, పక్కనే డ్రమ్ము కనిపించిందని గది లో రక్తపు మరకలు కూడా ఉన్నాయని తలపై గాయాలు ఉన్నాయని గ్రామ స్థులు తెలిపారు. అనుమానంతో బొసింగ్ తల్లి తులసి రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

కృష్ణానదిలో దూకి

మహిళ ఆత్మహత్యాయత్నం

» కాపాడిన మత్స్యకారులు

ఎర్రవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి కృష్ణానది బ్రిడ్జి మీది నుంచి దూకి మహిళ ఆత్యహత్యాయత్నం చేసింది. ఇటిక్యాల ఎస్ఐ రవి కథనం ప్రకారం... హైదరాబాద్ పట్టణం జీడిమెట్ల సూరారంకు చెందిన జయశ్రీ కుటుంబ కలహాలతో గురువారం ఇంటి నుంచి బయల్దేరి ఎర్రవల్లికి చేరుకుంది. మళ్లీ తిరిగి హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం బీచుపల్లికి వచ్చి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకింది. గమనించిన స్థానిక మత్స్యకారులు వెంటనే అప్రమత్తమై పుట్టిల సహాయంతో ఆమెను ఒడ్డుకు చేర్చారు. ఎలాంటి ప్రాణపాయం లేకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని, తల్లితండ్రులు, భర్తను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించి అప్పజెప్పినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

సీసీఎల్‌కు ముందుకురాని సంఘాలు

» ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం రూ.385 కోట్లు
» గడువు ఐదు నెలలు... పెండింగ్‌లో 60శాతం రుణాలు
» ఇప్పటికీ 40శాతం రుణాలే అందించిన బ్యాంకర్లు


మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చాలా సంఘాలలోని సభ్యులు పాతలోన్ పూర్తికాకుండా కొత్త లోన్ తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇందుకు కారణం లేకపోలేదు. క్యాష్ క్రెడిట్ లోన్స్(సీసీఎల్) కారణంగా వారు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో లక్ష్యం మేరకు రుణాలు గ్రౌండ్ చేయలేకపోతున్నట్లు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. గ్రూప్‌లో ఏ సభ్యురాలికి అవసరం ఉంటే ఆ సభ్యురాలికి లోన్ ఇవ్వాలని సంఘాల సభ్యులు కోరుతుండటం గమనార్హం. బ్యాంకర్లు మాత్రం మొత్తం సంఘానికే లోన్లు ఇస్తామంటున్నారు.

మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా వ్యక్తిగత రుణాలు అందిస్తున్నది. జిల్లాలోని మహిళా సంఘాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ 385 కోట్లు అందించాలని లక్ష్యం నిర్దేశించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 16 మండలాల పరిధిలో 485 గ్రామైక్య సంఘాలు ఉండగా, 11,695 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 192 పీడబ్లూటీ సంఘాలు ఉన్నాయి. సంఘానికి 10 మంది చొప్పున పీడబ్లూటీ సంఘాలలో 1,922 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం జిల్లాలోని అన్ని సంఘాల్లో కలిపి 1,24, 695 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే పావలా వడ్డీ రుణాలతో పాటు బ్యాంకుల ద్వారా ఈ రుణాలను అందిస్తున్నారు. సెప్టెంబరు నాటికి జిల్లాలో అన్ని సంఘాలకు కలిపి రుణాలు రూ.118 కోట్లు అందించారు. మొత్తంగా 40శాతం రుణాలను మహిళా సంఘాల సభ్యులకు అందించారు. అత్యధికంగా రుణాలు రూ.10 కోట్ల 89 లక్షలు గండీడ్ మండలంలో అందించగా, అత్యల్పంగా మూసాపేట మండలంలో రూ 1,74లక్షలు అందించారు.

● సీసీఎల్‌కు ముందుకు రాని మహిళా సంఘాలు

జిల్లాలోని మహిళా సంఘాలు గత ఆర్థిక సంవత్సరంలో 10 మంది సభ్యులు గల సంఘం బ్యాంకు నుంచి రూ 10లక్షలు రుణాలు స్వీకరించారు. ఆ లోన్ పూర్తికాకుండా కొత్తలోన్ ఇవ్వడం కుదరదు. ప్రస్తుత టార్గెట్ పూర్తికావాలంటే రుణాలు ఉన్న సంఘాలకే మళ్లీ రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. వారు తీసుకున్న లోన్స్ పూర్తికావాలంటే 4సంవత్సరాల కాల పరిమితి పడుతుంది. దీంతో సీసీఎల్ ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. దీంతో చాలా సంఘాలలోని సభ్యులు పాతలోన్ పూర్తికాకుండా కొత్త లోన్ తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో లక్ష్యం మేరకు రుణాలు గ్రౌండ్ చేయలేకపోతున్నారు. గ్రూప్‌లో ఏ సభ్యురాలికి అవసరం ఉంటే ఆ సభ్యురాలికి లోన్ ఇవ్వాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు. బ్యాంకర్లు మాత్రం మొత్తం సంఘానికే లోన్లు ఇస్తామంటున్నారు.

● త్వరలోనే వందశాతం రుణాలు అందిస్తాం



జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా సంఘాల సభ్యులకు రూ 385 కోట్లు ఇచ్చేందుకు లక్ష్యం నిర్దేశించాం. గతనెల సెప్టెంబరు వరకు జిల్లాలోని 16 మండలాల్లో 40 శాతం మేర రుణాలు అందించడం జరిగింది. వాటిలో గండీడ్, చిన్నచింతకుంటలో అత్యధికంగా రుణాలు అందించాం. అత్యల్పంగా మూసాపేట, రాజాపూర్ మండలాల్లో ఇవ్వడం జరిగింది. త్వరలోనే 100 శాతం రుణాలు అందిస్తాం.

- శారద, ఏపీడీ

బీఆర్ఎస్ రాకతోనే రాజకీయ విలువలు నాశనం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు


సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నరసింహులు

వనపర్తి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాజకీయ విలువలను నాశనం చేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీ వచ్చి రాజకీయ క్రమశిక్షణను పూర్తిగా భ్రష్టుపట్టించిదని, డబ్బులు పంచే విష సంస్కృతికి బీజం వేసిందని మండిపడ్డారు. సహజ సిద్ధమైన సంపదలను కొల్లగొట్టి, లక్షల ఎకరాల భూములను బీఆర్ఎస్ నాయకులు చెరబట్టారని దుయ్యపట్టారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీని తిరిగి పునర్నిర్మాణం చేసుకుంటున్నామని, రాబోయే ఎలక్షన్‌లలో పోటీకి టీడీపీ దూరంగా ఉంటుందన్నారు. మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన పార్టీలు కోరితే మద్దతు ఇచ్చి వారి గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ బొలమోని రాములు, కొల్లాపూర్ ఇంచార్జ్ సుధాకర్ నాయుడు, చంద్రశేఖర్, కిషన్ నాయక్, ఎండీ దస్తగిరి, కాగితాల లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, ఆవుల శ్రీను, హోటల్ బాలరాం, మేదరి బాలయ్య, కొత్తగొల్ల శంకర్, డి బాలరాజు, దస్తగిరి, గంధం కృష్ణయ్య, అప్పాయిపల్లి బాలయ్య పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

» కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 68,445 క్యూసెక్కులు మాత్రమే వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు కాలువలు, ఎత్తిపోతల ద్వారా 79,985 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 215.32 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మటి, నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు మూతపడగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. భీమా నది ద్వారా మరో 60 వేల క్యూసెక్కులు జూరాలకు వచ్చి చేరుతోంది. జూరాలకు ఇన్‌ఫ్లో 79 వేల క్యూసెక్కులు ఉండగా రెండు గేట్ల ద్వారా 14,330 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 45,481 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మక్తల్‌లో భారీ వర్షం

నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం రాత్రి పలు చోట్ల వర్షం కురిసింది. శుక్రవారం కూడా మోస్తరు వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 125.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 51.5, ధన్వాడ మండలంలో 45.3, దామరగిద్ద మండలంలో 17.2, మద్దూర్‌లో 12.3, నారాయణపేటలో 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో 47.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వెల్దండలో 28.8, కల్వకుర్తిలో 25.3, బిజినేపల్లిలో 21.0, నాగర్‌కర్నూల్‌లో 13.8, తాడూరులో 11.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

భోజనంలో తాటిజెర్రి ఘటనపై

డీఈవో విచారణ

» విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీఈవో, అక్షయపాత్ర ప్రతినిధి


బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు, అక్షయపాత్ర ప్రతినిధి శరత్‌తో కలిసి భోజనం చేస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనంలో వచ్చిన తాటిజెర్రి సంఘటనపై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ విచారణ చేపట్టారు. అక్షయపాత్ర సంస్థ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. దీంతో సంస్థ ఆధ్వర్యంలో భోజనం తయారు చేసే ప్రాంతాన్ని డీఈవో, జడ్చర్ల ఎంఈవో మం జులాదేవితో పాటు పలువురు పరిశీలించా రు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ లో విద్యార్థులతో పాటు అక్షయపాత్ర సంస్థ ప్రతినిధి శరత్‌తో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనంలో తాటిజెర్రి వచ్చిన సంఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని వెంటనే రద్దు చేయాలంటూ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సౌమ్య డిమాండ్ చేశారు. విద్యార్థులకు నా ణ్యమైన భోజనం అందించాలని, అక్షయ పాత్ర భోజనాన్ని రద్దు చేయాలంటూ డీఈ వోకు వినతిపత్రం అందచేశారు. ఏబీవీపీ నాయకులు యశ్వంత్, సతీష్, చందు, విజయ్, రాజు, దీపక్, విష్ణు, శ్రీను, రాఘవేందర్, శివ, సాయితేజ తదితరులున్నారు. అక్షయపాత్ర భోజనాన్ని రద్దు చేయాలంటూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, శ్రీనాథ్‌లు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందచేశారు. అందచేసిన వారిలో భానుప్రసాద్, ప్రవీణ్, జ్ఞానేశ్వర్, నర్సిములు, జాఫర్‌లున్నారు.

30 మంది బాలకార్మికులకు విముక్తి

» జిల్లా పోలీస్ అధికారులచే వాహనాల తనిఖీ

లింగాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తి చేళ్లకు వెళ్తున్న 30మంది విద్యార్థుల పని నుంచి విముక్తి కల్పించినట్లు ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామ శివారులో లింగాల ఎస్ఐ వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో జిల్లా ఏఎస్‌టీయూ, సీసీఎస్ సీఐ శంకర్, షీటీం ఎస్ఐ రజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలందరూ పాఠశాల, కళాశాలలో ఉండాలన్నారు. బడి బయట పిల్లలను పనులు చేయమని ప్రోత్సహించడం, చేయించుకోవడం నేరమని అన్నారు. బడి ఈడు పిల్లలు, విద్యార్థులు పత్తి చేళ్లకు పనులకై వెళ్లరాదని సూచించారు.

ఏడు వాహనాల్లో విద్యార్థులను పత్తి చేళ్లకు తరలిస్తుండగా వాటిని తనిఖీలు నిర్వహించి అందులో వెళ్తున్న 30మంది విద్యార్థులను విముక్తి కల్పించారు. పిల్లలను లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు.

ఇక నుంచి వాహనాల్లో పిల్లలను తరలిస్తే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్‌టీయూ సీసీఎస్ సీఐ శంకర్, ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్, షీటీం ఎస్ఐ రజిత, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ సహదేవ్, వెంకటేశ్, శివశంకర్, ఖుద్దూస్, మాల్యానాయక్, బాలరాజు, కనకయ్య, లీలాబాయ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కొండయ్య, బాలల హక్కుల పరిరక్షణ రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 67 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందా?

» బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు


మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మంత్రి జూపల్లి కృష్ణారావుకు చిత్తశుద్ధి ఉంటే కొల్లాపూర్ నియోజకవర్గంలో 67 శాతంతో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు మంత్రికి ఛాలెంజ్ విసిరారు. కొల్లాపూర్‌లో బీజేపీ 70 శాతం మించి , బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పిస్తుందని, మరి కాంగ్రెస్ కూడా 67 శాతం రిజర్వేషన్లు ఇస్తుందా అని ప్రశ్నించారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ దిశగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సందు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తమటం శేఖర్ గౌడ్, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల శివుడు కొల్లాపూర్ గ్రామీణ మండల అధ్యక్షులు కేతూరి నారాయణ, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు పరుశురాం, కొల్లాపూర్ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్, ధనుంజయ్ గౌడ్, వెంకటేష్, భరత్ పాల్గొన్నారు.

ఆధునిక శిక్షణ కేంద్రాలతో

యువకులు ఉపాధి పొందాలి

» ఏటీసీ కోర్సులతో యువతకు నైపుణ్యాభివృద్ధి
» కలెక్టర్ బదావత్ సంతోష్


మన్ననూరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రంలో యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మన్ననూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక శిక్షణ కేంద్రాల ద్వారా నైపుణ్యాభివృద్ధి సాధించి యువకులు స్వయం ఉపాధి పొందాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. టాటా కన్సల్టెన్సీ వారి సౌజన్యంతో ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆధునిక శిక్షణ (ఏటీసీ) కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఆధునిక పరికరాలు, శిక్షణ లాబొరేటరీలు, వర్క్‌షాప్ విభాగాలు, తరగతి గదులను పరిశీలించి ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామితో వివరాలు సేకరించారు. కేంద్రంలో మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ అనే కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి శిక్షణ పొందుతున్న తీరును, ల్యాబ్ సదుపాయాలు ఎలా ఉన్నాయి అనే అంశాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అమ్రాబాద్ తహశీల్దార్ శైలేంద్ర కుమార్ , ఆర్ఐటిఐ ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

అసలు ఏమిటేది?


ఎగిసిపడుతున్న తెల్లటి నురుగు

ఎర్రవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో వింతగా ఉన్న ఓ వీడియో వైరల్‌గా మారింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మేఘం కింద పడిందని భావించిన స్థానికులు వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పెట్టారు. అసలు అది మేఘమా లేకా మరేదైనా అనే చర్చ ఆసక్తిగా కొనసాగింది. ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ఈ వింత సంఘటన చోటు చేసుకుంది. అది మేఘాలు కాదు ఇండస్ట్రియల్ వ్యర్థాల ద్వారా ఎర్పడిన తెల్లటి కెమికల్ నురుగు అని స్థానికులు చర్చించుకున్నారు. గత కొద్ది రోజుల క్రితం జాతీయ రహదారిపై ట్యాంకర్ ప్రమాదానికి గురైందని, అందులో ఉన్న ఆయిల్ సమీపంలో అక్కడక్కడ పడటంతో గురువారం కురిసిన వర్షం నీటిలో ఇలా నురుగు ఎగసిపడినట్లు చర్చించుకున్నారు.

పీయూలో యోగా ఎంపికలు


ఆసనాలు వేస్తున్న క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో యోగా మహిళల, పురుషుల విభాగంలో క్రీడాకారులను శుక్రవారం పీ యూలో ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సి టీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిని పీయూ పీడీలు సెలక్షన్ కోచ్‌లు ఎంపికలు జరిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మంచి ప్రదర్శ న కనపరిచి విజయం సాధించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ కోరారు. ఈ ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీ, కర్ణాటకలోని స్వయస యూనివర్సిటీలో వచ్చే నెల 20 నుంచి 28 వరకు జరిగే సౌత్‌జోన్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, జిల్లా యోగా అసోసియేషన్ సెక్రటరీ బాలరాజయ్య, పీడీలు రజిని, చంద్రకళ, పాల్గొన్నారు.

మినుము పంట సాగుపై అవగాహన


రైతులకు మినుము, ఆకుకూరల విత్తనాలను పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్లు

తాడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడూరు మండల పరిధిలోని తుమ్మలసూగురు గ్రామంలో వ్యవసాయ కళాశాల పాలెం వారి ఆధ్వర్యంలో గురువారం రైతులకు మినుము పంట సాగుపై అవగాహన కల్పించి ఆకు కూరల విత్తనాలు, మినుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, ఎంటమాలజీ డాక్టర్ కే కవిత మాట్లాడుతూ మినుము పంటలో కలుపు మందులు ఎరువులు నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల్లో ఉన్న చీడపీడల గురించి అవగాహన కల్పించి వాటికి తగిన మందులను సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ భానుశ్రీ, ఎన్.నవత, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

మానవపాడులో తాగునీటికి అవస్థ

● గ్రామానికి చివరలో ఉన్న ట్యాంకును పూర్తిస్థాయిలో నింపడంలో నిర్లక్ష్యం

● అరకొర నీటితో ఇబ్బందులు పడుతున్న 7, 8 వార్డుల ప్రజలు



నీళ్ల ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మానవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం నిత్యం అవస్థ పడుతున్నామని మండల కేంద్రంలోని 7, 8 వార్డుల్లోని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం మిషన్ భగీరథ నీళ్ల ట్యాంక్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. రెండు నెలల నుంచి నీళ్లు అరకొరగా అందుతున్నాయని, దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని మహిళలు వాపోయారు. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నామంటూ చెబుతున్నా నీరు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాలనీవాసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన మరుసటిరోజు మాత్రమే నీటి సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. గ్రామానికి చివరన ట్యాంక్ ఉండటం వల్ల పూర్తిసామర్థ్యం వరకు నీటిని నింపడం లేదని అన్నారు. ఈ సమస్యను వాటర్ గ్రిడ్ అధికారులకు తెలిపినా ప్రయోజనంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పరిశీలించారు



కాలనీల్లో తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నమని చెబుతున్న అధికారులు పర్యవేక్షణ చేయడంలేదని, సమస్య చెప్పినప్పుడు మాత్రమే మండల కార్యలయానికి వచ్చి సమాధానంతో సమస్య పరిష్కరించి కిందిస్థాయివారికి చెప్పి వెళ్తున్నరే తప్ప పనులు చేయడంలేదు. ట్యాంకుకు నీటిని ఎక్కించేందుకు ఇబ్బంది ఏముంది.

- దస్తగిరి, మానవపాడు

పనులకు వెళ్లలేకపోతున్నాము..



తాగునీటి సమస్య కారణంగా పంట పొలాల పనులకు వెళ్లలేకున్నాం. కాలనీలో తాగునీటి రాక పోవడంతో ఇతర కాలనీలకు వెళ్లి స్థానికంగా ఉన్న బోర్లు నీటిని తెచ్చేకుని కాలం గడుపుతున్నాం. రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ఆరకోర నీరు వస్తే మోటర్ల ద్వారా నీటిని తోడేసుకుంటున్నారు.

- మాబీ, మానవపాడు

సమాచార హక్కు చట్టంపై పారదర్శకత పాటించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రభుత్వ అధికారుల పని తీరులో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించడం జరిగిందని, ఈ చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గద్వాల ఐడీవోసీ సమావేశపు హాలులో శుక్రవారం అధికారులకు సమాచార చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పౌరులకు సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం వారు అడిగిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం ఇవ్వడం అధికారుల బాధ్యతన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఆయా శాఖల నుంచి తమకు కావలసిన సమాచారాన్ని పొందడం పౌరుల హక్కు అన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రజలు అడిగిన సమాచారాన్ని నిర్దేశిత సమయంలో ఇవ్వకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వారోత్సవాల సందర్భంగా గ్రామాలు, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు వచ్చేలా బోధించాలి



ఎర్రవల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఎర్రవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యం వారిలో పెంపొందేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని కలెక్టర్ సంతోష్ చెప్పారు. శుక్రవారం ఎర్రవల్లిలోని కస్తూర్బాగాంధీ, పదో బెటాలియన్‌లో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి పలువురు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠాలు అర్థం చేసుకుని పరీక్షల్లో ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచించారు. దసరా సెలవులు ముగిసినప్పటికీ విద్యార్థులు రాక పోవడంపై ప్రశ్నించారు. హాజరుశాతం పెరగాలని సూచించారు.

జిల్లాలోని అన్ని కస్తూర్బాలలో కంప్యూటర్ తరగతులు నిర్వహించాలని డీఈవో విజయలక్ష్మిని ఆదేశించారు. కంప్యూటర్లు మంజూరైనప్పటికీ తరగతులు ప్రారంభం కాకపోవడంపై ఎస్‌వోను ప్రశ్నించారు. విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని, స్టోర్ రూం, మెనూను పరిశీలించారు. కేజీబీవీలో సమస్యలను ఉపాధ్యాయినీలు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ఎర్రవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి హంపయ్య, ప్రత్యేకాధికారి స్వర్ణలత, ఉపాధ్యాయుడు మహబూబ్‌పాష పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి

● డీఈవో విజయలక్ష్మి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో విజయలక్ష్మి

ధరూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక క్రీడను ఎంచుకుని రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని సూచించారు. శుక్రవారం 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు ధరూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని 13 మండలాల నుంచి 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు పోటీల ప్రారంభంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.ప్రతాప్‌రెడ్డి, మండల విద్యాధికారి రవీంద్ర బాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తోట శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులతో వందనం స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. పీఈటీలు, కోచ్‌లు ఇచ్చే విలువైన సలహాలు, సూచనలను పాటించాలని సూచించారు. పోటీల్లో బాలికల విభాగంలో ఎర్రవల్లి మండలానికి మొదటి బహుమతి, బాలుర విభాగంలో గట్టు మండలానికి మొదటి బహుమతి, అయిజ మండలానికి మొదటి బహుమతి, మల్దకల్ మండలానికి రెండవ బహుమతి పొందారు. విజేతలకు డీఈవో బహుమతులు ప్రదానం చేశారు. కాగా, ఇక్కడ ఎంపికైన విద్యార్థులు ఈనెల 13వ తేదీ సోమవారం జడ్చర్లలోని బాదేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జోనల్ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు సిబ్బంది, వివిధ మండలాల క్రీడాకారులు ఉన్నారు.

మా ఊళ్లోనే పింఛన్ ఇవ్వండి సారూ..

మానవపాడు,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పింఛన్ తీసుకొనేందుకు ప్రతీ నెల మండల కేంద్రానికి వచ్చివెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని మండల పరిధిలోని అమరవాయి గ్రామానికి చెందిన పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తంచేశారు. వీరి సమస్యపై కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యదర్శి సీరాజ్, గ్రామస్థులు శుక్రవారం ఎంపీడీవో రాఘవకు వినతిపత్రం అందించారు. అమరవాయి గ్రామంలోనే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రానికి వచ్చి వృద్ధులు వేచి ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు రమేశ్, మురళి, సీరాజ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా చూడాలి



ప్రజలకు అవగాహన చేస్తున్న తెలంగాణ సాంస్కృతిక ఉద్యోగులు

మల్దకల్(గద్వాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులు అంటువ్యాధుల బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు మల్దకల్ మండల పరిధిలోని మల్లెందొడ్డిలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటిస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనారోగ్యం ఉంటే మీ ఆశా కార్యకర్తల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షించుకొని మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు కేశవులు, హజ్రత్, స్వామి, భూపతి తమ ఆటపాటలతో గ్రామస్థులను అలరింపజేశారు.

బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం

గద్వాల క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనాన్ని ఢీకొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గద్వాలలోని దౌదర్‌పల్లి కాలనీలో నివాసం ఉంటున్న బుడుడ జంగాల పెద్దయ్య(35) ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ధరూర్ మండలంలో వ్యాపారం చేసి గద్వాలకు వస్తుండగా, కొండపల్లికి చెందిన నల్లన్న అనే వ్యక్తి పత్తిని బొలెరో వాహనంలో తీసుకొని గద్వాల నుంచి రాయిచూర్‌కు వెళుతుండగా జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వస్తున్న పెద్దయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సాయమ్మ, ఐదుగురు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఆశా వర్కర్లకు పదోన్నతులు కల్పించాలి

గద్వాల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇచ్చిన హామీమేరకు అర్హులైన ఆశావర్కర్లకు ఏఎన్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ వలంటీరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ కోరారు. శుక్రవారం పట్టణంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో గద్వాల, ఉప్పేరు పీహెచ్‌సీల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి సునీత, ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆశావర్కర్లకు ప్రభుత్వపరంగా తగిన ప్రోత్సాహం లేకపోవడం విచారకరమన్నారు. కమిషనరేట్ ముట్టడి సందర్భంగా అర్హులైన ఆశావర్కర్లకు ఏఎన్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చి ఏడాది దాటినా పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. అర్హత ఉన్నా, సుదీర్ఘకాలంగా పాటు సేవలందిస్తున్నా పదోన్నతులు లేకుండానే అనేక మంది పదవీ విరమణ పొందుతుండగా విధుల్లో ఉండి మరణించి వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి తోడ్పాటు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఆశాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మట్టి ఖర్చుల కోసం రూ.50వేలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని, పారితోషికం లేని పనులు అప్పగించవద్దని కోరారు. ఈ సందర్భంగా గద్వాల, ఉప్పేరు పీహెచ్‌సీలకు వేర్వేరుగా నూతన కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. మహాసభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ, ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ ఉన్నారు.



మహాసభలో పదోన్నతుల కోసం డిమాండ్ చేస్తున్న ఆశావర్కర్లు

ఇంటర్వ్యూ..

గ్రామాల అభివృద్ధికి కృషి

● రాఘవ, ఎంపీడీవో



మానవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీవో రాఘవ అన్నారు. పథకాల నిర్వహణ, అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ చేస్తున్నామని శుక్రవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది?

ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్య పనులపై పర్యవేక్షణ ఉంటుంది. కార్మికులకు సూచనలు ఆదేశాలు ఇస్తున్నాం.

చెత్తసేకరణ సరిగా లేదని విమర్శలు ఉన్నాయి?

ఇంటింటికీ వెళ్లి నిత్యం చెత్త సేకరణ చేస్తున్నారు. ట్రాక్టర్ వెళ్లలేని కాలనీలకు కార్మికులు వెళ్లాలి. దీన్ని అన్ని గ్రామాల్లో తప్పకుండా పాటించాల్సిందే.

డ్రైనేజీలను ఎప్పుడు శుభ్రం చేస్తారు?

డ్రైనేజీల్లో ఎక్కడా మురుగు నిలిచి ఇబ్బంది లేనంత వరకు సరే. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే మొత్తం డ్రైనేజీని శుభ్రం చేయాల్సిఉంటుంది. మళ్లీ ఇబ్బందిలేకుండా చూడాలి.

కొందరు కార్మికుల పనితీరుపై ఆరోపణలు వస్తున్నాయి?

గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికులు తప్పనిసరిగా ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాల్సిందే. ఎక్కడా సమస్య రాకుండా పనిచేయాలి. ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలి.

న్యూస్ బాక్స్

జూలేకల్‌కు మిషన్ భగీరథ నీరు బంద్

వడ్డేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం జూలేకల్ గ్రామానికి మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరురావడం లేదని గ్రామస్థులు తెలిపారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, బోర్లు, పంపుసెట్ల వద్ద నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామానికి భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు.

నేడు కంటి వైద్యశిబిరం

వడ్డేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలెకల్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కందూరి రాంరెడ్డి హస్పిటల్, ఏసుగొండ వైద్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరికి పరీక్షలు నిర్వహిస్తామని, ఉచితంగా కంటి శుక్లం ఆపరేషన్లు కూడా చేస్తామని తెలిపారు.

సీజేఐపై దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

మానవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీరెల్లి సబ్‌స్టేషన్‌లో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున, మెయింటెనెన్స్ ఉన్న కారణంగా ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో బీరెల్లి, లత్తిపురం, తెలుగోనిపల్లి, ములకలపల్లి, తుర్కోనిపల్లి, గుర్రంగడ్డ, బసాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలన్నారు.

మన్నాపురం పాఠశాల తనిఖీ

ధరూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సిలబస్‌ను త్వరగా పూర్తిచేసి విద్యార్థులను ఎస్‌ఏ-1 పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈవో రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో యూపీఎస్ మన్నాపురం పాఠశాలను ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన ఎంఈవో, సూచించిన టైంటేబుల్ ప్రకారం పాఠాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం కిచెన్ గార్డెన్‌ను కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. మెనూప్రకారం భోజనం అందించాలని చెప్పారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలన్యూటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. గద్వాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించి 18 మంది లబ్ధిదారులకు రూ.4,05,000 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరక్టర్ సుభాన్, మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడు, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, నాయకులు అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, శ్యామ్, కేశవరెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

మానసిక చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

● లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్

గద్వాల క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగులు, మానసిక చట్టాలపై అందరికి అవగాహన ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక చట్టాలపై వైద్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గద్వాల మండల పరిధిలోని పర్మాల గ్రామ శివారులోని రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా ఇద్దరు బాలకార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. అలాగే బుర్దిపాడు శివారులో పొలం పనులు నిర్వహిస్తున్న ముగ్గురు బాలకార్మికులను డ్రాప్ అవుట్స్‌గా గుర్తించి వారిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులు నేరంగా మాత్రమే కాకుండా వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అంశమని, ప్రతి ఒక్కరు దీనిపై చైతన్యం కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. రాజేందర్‌తో పాటు బి.శ్రీనివాసులు, డి. లక్ష్మణస్వామి, ఆర్‌ఎంవో డాక్టర్ అభినేశ్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, రవి, నవీన్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుల కొరత తీర్చాలి

● ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్

గట్టు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న అధ్యాపకుల కొరత తీర్చాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.నర్మద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సబెక్ట్‌ల అధ్యాపకులు లేక పోవడంతో అర్థంకాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇతర కళాశాలల నుంచి అధ్యాపకులు వస్తున్నారని ఉదయం మొదటి సంవత్సరం వారికి, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం వారికి బోధిస్తున్నారన్నారు. బోధనా సిబ్బంది కొరత వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదన్నారు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామంటున్నా, అలా జరగడం లేదన్నారు. గట్టు కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆమెవెంట ఐద్వా నాయకురాలు రాణి, విద్యార్థులు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్

గద్వాల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రి లేకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో అంతర్జాతీయస్థాయి విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్న సీఎం ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను విడుదల చేయక పోవడం శోచనీయమన్నారు. అదే సమయంలో కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల దృక్పథంతో ప్రభుత్వ విద్యా నిర్వీర్యమయ్యే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతుందని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీశ్, చందు, సురేష్, తిరుమలేష్, అనిల్, జగన్ ఉన్నారు.

భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలి

● రాష్ట్రస్థాయి పోటీలకు అయిజ తైక్వాండో విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్ అడ్వకేట్ మధుకుమార్

అయిజ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాస్టర్ అడ్వకేట్ మధుకుమార్ సూచించారు. గద్వాలలో గురువారం జోనల్ లెవెల్ ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. అందులో అయిజ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈమేరకు శుక్రవారం ఈ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఆశించిన స్థాయికి ఎదగాలని తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 14 విభాగంలో శ్రీనాథ్, 17 విభాగంలో నందకిశోర్, వీరేంద్ర, శివశంకర్, యు.శివశంకర్, రాంతేజ్, శోభన్, విక్రమ్, విశ్వతేజ ప్రతిభ కనబరిచారు. త్వరలో నిర్వహించే తైక్వాండో పోటీలో ఈ విద్యార్థులు పాల్గొననున్నట్లు ట్రైనర్ సుధీర్, నవదీప్ తెలిపారు.

మద్యం దుకాణాలకు 17 దరఖాస్తులు



గద్వాల స్టేషన్‌కు సంబంధించి మద్యం దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి

గద్వాల క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఉన్న 34 మద్యం దుకాణాలకు సంబంధించి ఇప్పటివరకు 17 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో అలంపూర్ స్టేషన్ పరిధిలో ఉన్న 13 మద్యం దుకాణాలకు సంబంధించి 12 దరఖాస్తులు రాగా, గద్వాల స్టేషన్ పరిధిలో ఉన్న 21 మద్యం దుకాణాలకు శుక్రవారం ఒక్కరోజు 5 దరఖాస్తులు వచ్చాయన్నారు. గద్వాల మునిసిపాలిటీ పరిధిలోని గెజిట్ నెం. 4కు 1, గెజిట్ నెం. 7కు సంబంధించి 2, గెజిట్ నెం. 8కు 2 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అయితే శనివారం కూడా మద్యం దుకాణాల దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు.

మొన్న తేళ్లు.. నిన్న పాములు.. నేడు కొండచిలువ

● వంద పడకల ఆసుపత్రిలో భయం భయం

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అలంపూరు చౌరస్తాలో రూ.21 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి ఆవరణలో లైట్లు అమర్చాలని నెత్తినోరు కొట్టుకున్నా, పత్రికల్లో కథనాలు వచ్చినా సదరు శాఖ, కలెక్టర్‌గానీ పట్టించుకున్న పాపానపోలేదు. మొన్న తేళ్లు, నిన్న పాములు, నేడు కొండచిలువ ఆస్పత్రిలోకి రావటంతో పేషెంట్లు, సిబ్బంది హడలిపోయారు. శుక్రవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఆసుపత్రి ఎదుట ఉన్న కంపచెట్ల నుంచి ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశిస్తుండగా ఆసుపత్రికి వచ్చే రోగులు గమనించారు. సిబ్బందికి తెలుపగా వీడియో తీసి డాక్టర్ అమీర్‌కు పంపారు. ఆయన అక్కడికి చేరుకుని ఎస్సై శేఖర్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి పరిశీలించి ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. ఆవరణలోకి కొండచిలువ రావడంతో సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. రాత్రంతా ఆసుపత్రి తలుపులు మూసుకుని గడిపారు.



ఆసుపత్రి ఆవరణలోకి వెళ్తున్న కొండచిలువ